

ఆలయాల్లో పూజలు

కోరుట్ల/ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి, అష్టలక్ష్మీ ఆలయాల్లో జిల్లా జడ్జి నీలిమ కుటుంబ సమేతంగా పూజలు చేశారు.



శాంతించిన గోదావరి

ధర్మపురి: ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి వచ్చిన వరద నీటితో ఉగ్రరూపం దాల్చిన గోదావరి శనివారం తగ్గుముఖం పట్టింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నివేదిక అందజేయాలి



రోడ్డు పరిశీలిస్తున్న దావ వసంత

రాయికల్(జగిత్యాల): భారీ వర్షాలతో జిల్లాలో దెబ్బతిన్న పంటలు, తెగిపోయిన రోడ్ల వివరాలను యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. చెర్లకొండాపూర్, ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేట, ఒడ్డెరకాలనీ గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. వరదలతో నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, సర్పంచులు సామల్ల లావణ్య, రాజేశం, తిరుపతి, నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీ బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్‌ను బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాస్‌ను కరీంనగర్ ఎస్బీ డీఎస్పీగా బదిలీ చేశారు.

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా అనిల్‌బాబు



జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా అనిల్‌బాబును నియమించారు. ఈమేరకు చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అనిల్‌బాబుకు పదోన్నతి కల్పిస్తూ జగిత్యాలకు బదిలీ చేశారు. వెటర్నరీ శాఖకు చెందిన అధికారి బోనగిరి నరేశ్ ప్రస్తుతం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బామ్మలు.. భలే డాన్సర్లు



నృత్యం చేస్తున్న వృద్ధ మహిళలు

జగిత్యాలరూరల్: 'కెమెరా పట్టిండే సీమ దసరా సిన్నోడు.. ఎవల్ని తీస్తుండే సీమ దసరా సిన్నోడు' పాట ప్రస్తుతం సామాజిక మాధ్యమల్లో వైరల్‌గా మారింది. చాలామంది యువత ఈ పాటకు స్టెప్పులు వేస్తున్నారు. మేమేమీ తక్కువ కాదంటూ.. జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన వృద్ధ మహిళలు ఆశమ్మ, గంగు, రాజమ్మ, రాజేశ్వరి ఇదే పాటకు స్టెప్పులు వేస్తున్నారు. జిల్లావాసులను అమితంగా ఆకట్టుకుంటున్నారు. వీరు చేస్తున్న నృత్యాలు కూడా వైరల్ కావడం గమనార్హం.

15,487 ఎకరాల్లో పంట నష్టం



దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: ఈనెల 26, 27 తేదీల్లో కురిసిన వర్షాలతో జిల్లాలో 15,487 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ విస్తీరణాధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారని పేర్కొన్నారు. వరి 12,446 ఎకరాలు, పత్తి 279 ఎకరాలు, కంది 64 ఎకరాలు, సోయాబీన్ 58 ఎకరాలు, మొక్కజొన్న 2,373 ఎకరాలు, పసుపు 267 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఆయన వివరించారు. మొత్తం 14,065 మంది రైతులు పంటలు నష్టపోయారని నివేదిక రూపొందించామని చెప్పారు. పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

తెగిన బంధాలు

- ధ్వంసమైన రహదారులు
- స్తంభించిన రాకపోకలు
- గ్రామీణులకు తప్పని అవస్థలు

జగిత్యాల: జిల్లాలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో రహదారులు ధ్వంసమై జిల్లా కేంద్రానికి రాకపోకలు స్తంభించాయి. వివిధ అవసరాల కోసం జగిత్యాలకు వచ్చివెళ్లలేక కొందరు, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సుదూరం ప్రయాణం చేస్తూ మరికొందరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ప్రాథమికంగా నష్టం అంచనాలు రూపొందించారు. తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలూ తయారు చేశారు. కానీ, పనులు ఇప్పుడే ప్రారంభించే అవకాశాలు కనిపించడం లేదని అధికార యంత్రాంగం చెబుతోంది.

వారంరోజులుగా ఇబ్బందులే..

- వివిధ పనుల కోసం జిల్లాలోని పలు ప్రాంతాలు, గ్రామాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం జిల్లా కేంద్రానికి వచ్చిపోతుంటారు.
- భారీ వర్షాలతో రోడ్లు తెగిపోవడం, కోతకు గురికావడం, గుంతలు పడడంతో ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకంగా మారింది.
- వారంరోజులుగా రాకపోకలు స్తంభించడంతో వివిధ పనులేకాదు.. వైద్య సేవలు అందక జిల్లావాసులు అష్టకష్టాలు పడుతున్నారు.
- ముఖ్యంగా వ్యవసాయదారులు, వ్యాపారులు తమ అవసరాలను వారం రోజులుగా వాయిదా వేసుకుంటున్నారు.
- ఇప్పటికీ రాకపోకలు సాగక ఏం చేయాలో తోచక సతమతమవుతున్నారు.
- అయితే, జగిత్యాల–ధర్మపురి మధ్య అనంతారం రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేయడంతో జిల్లావాసులకు కొంత ఉపశమనం కలిగినట్లయ్యింది.
- కానీ, మళ్లీ భారీవర్షాలు కురిస్తే ఇది కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.
- తద్వారా ఉన్న కాస్త అవకాశం దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యయ ప్రయాసలు..

రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో గ్రామీణ ప్రజలకు బాహ్య ప్రపంచంతో బంధాలు దాదాపు తెగిపోయాయి. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి వచ్చివెళ్లలేకపోతున్నారు. అత్యవసర పనుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటే.. అదనంగా కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాదు.. ప్రైవేట్ వాహనాల్లో రెట్టింపు చార్జీలు వసూలు చేయడంతో చేతిచమురు వదులుతోంది.



సారంగాపూర్ మండలం నాగునూర్ – లచ్చక్కపేట, జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి ఇది. వర్షాలతో తెగిపోవడంతో నాగునూర్, లచ్చక్కపేట, రంగపేట, ఆలూరు, రాజనగర్, వీరాపూర్, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే వీలులేకుండాపోయింది.

రాకపోకలు బంద్



కోనాపూర్ వాగు వద్ద అప్రోచ్ రోడ్డు తెగింది. వారంరోజులుగా రాకపోకలు బంద్దైనయి. రెండు గ్రామాల ప్రజలు జగిత్యాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. వేరే మార్గాల్లోంచి పోతే.. రవాణా ఖర్చు పెరుగుతంది.

– మహేశ్, రేచపల్లి, సారంగాపూర్ మండలం



- భారీవర్షాలతో మల్లాపూర్ మండలం గొర్రెపల్లి చెరువు తెగింది. వరద ఉధృతికి బస్టాండ్ వద్ద ధ్వంసమైన 61వ జాతీయ రహదారి ఇది. రోడ్డు తెగిపోవడంతో జిల్లా కేంద్రానికి రాకపోకలు స్తంభించాయి.



- ఇది రాయికల్ – కొత్తపేట గ్రామాల మధ్య ఉన్న వంతెన. దీని సమీపంలోని రోడ్డు వరద ధాటికి ధ్వంసమైంది. జగిత్యాల – రాయికల్ మధ్య రవాణా నిలిచిపోయింది. గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



- ఇది సారంగాపూర్–బీర్‌పూర్ నుంచి జగిత్యాలను అనుసంధానించే ప్రధాన రహదారి. కోనాపూర్ వంతెన వద్ద వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.



- ఇది కథలాపూర్ మండలం సిరికొండ – తక్కళ్లపల్లి గ్రామాల మధ్య రోడ్డు. భారీవర్షాలతో తెగింది. రెండు గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి.

జిల్లా సమాచారం	
పంచాయతీరాజ్ రోడ్లు	768
పొడవు(కి.మీ.లలో)	1,712
దెబ్బతిన్న రోడ్లు	42
మరమ్మతుల అంచనా వ్యయం (రూ.కోట్లలో)	2.50

ఆర్‌అండ్‌బీ రోడ్ల కిలోమీటర్లు	1,190
దెబ్బతిన్న రోడ్లు	39
మరమ్మతుల అంచనా వ్యయం (రూ.కోట్లలో)	2
జాతీయ రహదారులు (ఎన్‌హెచ్‌– 63, ఎన్‌హెచ్‌– 61)	2
దెబ్బతిన్నవి	1

జిల్లా కేంద్రానికి పోయేదెట్లా?



రాయికల్ మండలం కొత్తపేట వద్ద వంతెనపై రోడ్డు వరదలకు తెగింది. రాకపోకలు బంద్దైనయి. రాయికల్, జగిత్యాలతో సంబంధాలు తెగిపోయాయి. రహదారిని మళ్లీ నిర్మించాలి.

– రాజేశ్, వీవీరావుపేట, మల్లాపూర్ మండలం

ఏటా తెగిపోతది



ప్రతీ వర్షకాలంలో వరదలకు రోడ్డు తెగిపోతంది. జగిత్యాల, కథలాపూర్ వెళ్లేందుకు ఇబ్బంది అవుతంది. వరద వెళ్లేలా కల్వర్టు కడితే సమస్య ఉండదు. తాత్కాలిక మరమ్మతులతో ఎలాంటి ప్రయోజనం ఉండదు.

– ఆరెల్లి సాయికుమార్, సిరికొండ, కథలాపూర్ మండలం

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

వర్షాల ధాటికి జిల్లాలో 39 రోడ్లు తెగిపోయాయి. వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడతాం. ఇందుకోసం దాదాపు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించాం.

– శ్రీనివాస్, ఈఈ, ఆర్ అండ్ బీ

నిధులు నీళ్లపాలు

- మూడు నెలల క్రితం మరమ్మతు
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు
- ప్రమాదకరంగా బొమ్మెనవాగు వంతెన

కథలాపూర్(వేములవాడ): అభివృద్ధి పనులకు నిధులు మంజూరైతే ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు.. ఆ నిధులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. దీనికి నిదర్శనం బొమ్మెన వంతెన పరిస్థితే. బొమ్మెనవాగుపై నిర్మించిన వంతెన గతేడాది కురిసిన వర్షాలకు ఓ వైపు కోతకు గురై కూలింది. రోడ్లు, భవనాలశాఖ నుంచి రూ.1.10 కోట్లు మంజూరు కాగా.. మరమ్మతులు పూర్తిచేశారు. ఈఏడాది ఏప్రిల్ 13న వంతెనను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు బొమ్మెనవాగు ఉధృతంగా ప్రవహించి వంతెన వద్ద ఒక వైపు పగుళ్లుబారి ప్రమాదకరంగా మారింది. వంతెన నుంచి రోడ్డు కలిసే చోట కుంగిపోయింది. రెండుచోట్ల మట్టి కొట్టుకు పోవడంతో గొయ్యిగా మారింది. మళ్లీవర్షం కురిస్తే గొయ్యిలో నీళ్ల చేరి వంతెన వద్ద రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



వంతెన పక్కన కోతకు గురైన రోడ్డు



వంతెనకు మరోవైపు ఏర్పడిన ప్రమాదకర గొయ్యి

సైడ్‌వాల్ కట్టలేదు



వంతెన మరమ్మతుకు రూ.1.10 కోట్లు వెచ్చించారు. మూడు నెలల్లోనే వంతెన పరిస్థితి అధ్వానంగా మారడం దారుణం. సైడ్‌వాల్‌ను ఎక్కువ పొడవు నిర్మిస్తే వాగులో నీరు ఉధృతంగా పారినప్పటికీ కోతకు గురికాకుండా ఉండేది. ఈ విషయాన్ని అప్పట్లోనే అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా, ఎవరూ పట్టించుకోలేదు. రోడ్డు, వంతెన కలిసే చోట కుంగింది. భారీవర్షం వస్తే వంతెన కూలుతుంది.

– అల్లూరి దేవారెడ్డి, బొమ్మెన

మరమ్మతు చేయాలి



ఇటీవల కురిసిన వర్షాలకు బొమ్మెనవాగు ఉధృతంగా పారింది. వంతెన వద్ద తెట్టె పగుళ్లు బారింది. మట్టి కొట్టుకుపోయింది. రోడ్డు ప్రమాదకరంగా మారింది. వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా గొయ్యిలు ఏర్పడ్డాయి. వాహనదారులు గమనించకుండా వెళ్తే అందులో పడి ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. త్వరగా మరమ్మతులు చేయిస్తే వంతెన కూలిపోకుండా ఆపవచ్చు.

– కోనేరెడ్డి రవీందర్‌రెడ్డి, బొమ్మెన

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బొమ్మెన వాగుపై వంతెన మరమ్మతు నాణ్యతతో చేయించాం. మూడు నెలల క్రితం పనులు పూర్తి చేయించాం. మొన్నటి వర్షాలతో ప్రమాదకరంగా మారిందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాగు ఉధృతంగా పారడంతోనే వంతెన వద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. అనుమతి రాగానే మరమ్మతు చేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం.

– మధు, ఏఈ, రోడ్ల భవనాలు, కోరుట్ల

జగిత్యాలలో మళ్లీ వర్షం

జగిత్యాల: జగిత్యాలలో మళ్లీ చిరుజల్లులు కురిశాయి. శనివారం సాయంత్రం చిన్నపాటి వర్షం పడింది. ఇప్పటికే శివారు కాలనీల ప్రజలు వరదతో ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వర్షాల నుంచి తేరుకోకముందే మళ్లీ వర్షాలు కురిస్తే మరిన్ని ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

నృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ



ధర్మపురి: అధిక శ్రావణమాసం సందర్భంగా శనివారం ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీలక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. వారంరోజుల పాటు కురిసిన భారీవర్షాలతో రాకపోకలు నిలిచిపోయాయి. భక్తులు రాలేని పరిస్థితి నెలకొంది. శనివారం వానలు తగ్గుముఖం పట్టడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



జగిత్యాలటౌన్ : మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు





సారంగాపూర్ : నర్సింహులపల్లెలో పులివేషధారణలో నృత్యాలు, కోరుట్ల: చిన్నమెట్‌పల్లిలో..



ధర్మపురిలో పీరీల ఊరేగింపు

దట్టీలు కట్టి.. పులివేషాలు వేసి..

జగిత్యాలటౌన్/సారంగాపూర్/ధర్మపురి/కోరుట్ల: జిల్లావ్యాప్తంగా శనివారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పీరీలను దర్శించుకుని దట్టీలు కట్టారు. భక్తులు పులివేషధారణలతో ఆకట్టుకున్నారు.

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల పరీక్ష కేంద్రాలు

జగిత్యాల: తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఉద్యోగాల కోసం ఇటీవల అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా, మూడు పేపర్లకు వేర్వేరు చోట్ల కేటాయించిన పరీక్ష కేంద్రాలతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. టీజీటీ మ్యాథమెటిక్స్ రెండో పేపర్ ఆగస్టు 5న, మొదటి పేపర్ ఆగస్టు 12న, మూడో పేపర్ ఆగస్టు 13న ఉంది. మొదటి పేపర్ హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు ఉండగా, మరుసటి రోజు 8.30 గంటల నుంచి 10.30 గంటలకు మంథనిలోని జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించనున్నారు. శనివారం హైదరాబాద్‌లో మరుసటి రోజు మంథనిలో ఉండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం


ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించినట్లు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అడ్మిషన్ పొందని విద్యార్థులు చివరి అవకాశాన్ని వి నియోగించుకోవాలని, ఇప్పటివరకు ఏ డిగ్రీ కళాశాలలో చేరని విద్యార్థులకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆగస్టు1 నుంచి 11వ తేదీ వరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అత్యుత్తమ బోధనతో పాటు, కళాశాల న్యాక్ గ్రేడ్ సాధించినట్లు పేర్కొన్నారు.

పరిహారం చెల్లించండి


దమ్మన్నపేటలో పర్యటిస్తున్న అడ్లూరి

ధర్మపురి: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. దమ్మన్నపేట, జైనా గ్రామాల్లో వరదలకు దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారీవర్షాలతో పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, కొన్నిచోట్ల నీటమునిగి పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. అర ఎకరం నుంచి పది ఎకరాల వరకు సాగు చేసుకుంటున్న సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలని కోరారు. మంత్రి హోదాలో ఉన్న కొప్పుల ఈశ్వర్ జోక్యం చేసుకుని సీఎంను ఒప్పించాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గంలో వేల ఎకరాలు వరద ప్రభావానికి గురయ్యాయని అన్నారు. గతేడాది వరదలతో చాలామంది రైతులు, తీరప్రాంతవాసులు నష్టాలు చవిచూశారని, అయినా, ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈసారైనా బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదలతో దెబ్బతిన్న జైనాలో గంగపుత్రులు నిర్మించుకున్న గంగమ్మతల్లి దేవాలయం దెబ్బతిందని, మంత్రి స్పందించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎల్‌డీఎం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీకాంత్, నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, కుంట సుధాకర్, అశెట్టి శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


రంగంపేట మార్గండి చెరువు మత్తడివద్ద చేపలు పడుతున్న స్థానికులు


జలకళ సంతరించుకున్న వట్టిమల్ల నారాయణ చెరువు


నిండుకుండలా రంగంపేట జంపన్న చెరువు


మత్తడి దుంకుతున్న మద్దిమల్ల రాయిని చెరువు

అలుగు పారుతున్న అన్నల చెరువులు!

వర్షాలతో జలకళ సంతరించుకున్న జలవనరులు

- తుపాకులు పక్కనపెట్టి.. తట్టాపారలు పట్టి
- 26 ఏళ్లక్రితం రంగపేట, వద్దిమల్ల, వట్టిమల్ల గ్రామాల్లో చెరువుల తవ్వకం
- ఆనాటి కరువును తీర్చిన నక్సలైట్లు

సాక్షి, కరీంనగర్ డెస్క్: 'కాకతీయులు.. రెడ్డిరాజులు చెరువులు తవ్వించారని.. అశోకుడు మొక్కలు నాటించెను అని చదువుకున్నాం'.. కానీ.. సమసమాజ స్థాపన కోసం ఆయుధాలు చేతపట్టి, అడవుల్లో సంచరించే అన్నలు(నక్సలైట్లు) 26 ఏళ్ల క్రితం రాజన్నసిరిసిల్ల జిల్లాలో చెరువులు తవ్వారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదో అధ్యాయం. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఆ చెరువులు జలకళ సంతరించుకొని మత్తళ్లు దుంకుతున్నాయి. 1990–2000 మధ్య కాలంలో సిరిసిల్ల ప్రాంతంలో పట్టున్న సీపీఐ (ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి విప్లవ గ్రూపు నక్సలైట్లు పోటాపోటీగా మూడు చెరువులు తవ్వారు.

కరువు కోరల్లో పల్లెలు..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట మండలాల్లోని అటవీ గ్రామాల్లో మూడు దశాబ్దాల క్రితం అడవిలో అన్నలదే రాజ్యం. ఏళ్లుగా బీడుగా మారిన భూములు.. కరువు కోరల్లో బతుకులు.. చెరువు నిర్మిస్తే బాగుండు.. బుక్కెడు బువ్వ దొరుకుతుందని ఆశించిన నిరుపేదలు.. ఏళ్ల తరబడి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో అడవిలో అన్నలు వీర్నపల్లి మండలంలోని రంగంపేటలో మార్గండి చెరువు (ప్రస్తుతం జంపన్న చెరువు), మద్దిమల్ల రాయిని చెరువు, కోనరావుపేట మండలంలోని వట్టిమల్లలో నారాయణ చెరువు తవ్వి కరువు తీర్చారు.

మొదట మద్దిమల్ల చెరువుకు శ్రీకారం..

వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు తవ్వకంలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ (మావోయిస్టు) కీలక పాత్ర పోషించింది. గుట్టల ప్రాంతం నుంచి వచ్చే నీరు వృథాగా ఒర్రెల ద్వారా వెళ్లిపోతోంది. ఆ నీటిని ఆపితే ఊరందరికీ మేలు జరుగుతుందని అప్పటి పీపుల్స్‌వార్ దళ నాయకుడు మధు ఉరఫ్ కొట్టాల మోహన్‌రెడ్డి భావించారు. మద్దిమల్లలో కులాలవారీగా కమిటీలు వేసి, 11 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. టీమ్ లీడర్లను నియమించి, చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 75 రోజులపాటు నిత్యం 600 మంది గ్రామస్తులు ఇందులో భాగస్వాములయ్యారు. సమీప గ్రామాలవారు కూడా నక్సలైట్ల ప్రోద్బలంతో శ్రమదానం చేశారు. సాయుధ నక్సలైట్లు తుపాకులను పక్కనపెట్టి, చెరువు కట్ట పోసేందుకు తట్టలు పట్టి, పని చేయడం విశేషం. ఈ ప్రాంత ట్రాక్టర్ యజమానులు సైతం సహకారం అందించడంతో చెరువు నిర్మాణం పూర్తయింది. నక్సలైట్ల నేతృత్వంలో తవ్విన తొలి చెరువు ఇదే. ఈ వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు మత్తడి దుంకుతోంది.

నెలరోజుల్లో పూర్తయిన 'జంపన్న'..

మావోయిస్టులు మద్దిమల్లలో చెరువు నిర్మించడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సీపీఐ(ఎంఎల్) జనశక్తి అప్పటి జిల్లా కార్యదర్శి జంపన్న వీర్నపల్లి మండలంలోని రంగంపేట శివారులో మార్గండి చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. ఊరిలోని కుల సంఘాలను ఏకం చేసి, వంతుల వారీగా పనుల్లో భాగస్వాములు కావాలని జనశక్తి పిలుపునిచ్చింది. దీంతో నెల రోజుల్లోనే చెరువు తవ్వకం పూర్తయింది. సాయుధ జనశక్తి నక్సలైట్లు సైతం శ్రమదానం చేశారు. నీరు వన్యప్రాణులకు, పశువులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. చెరువు మత్తడి వద్ద స్థానికులు చేపలు పడుతున్నారు.

నారాయణ చెరువుకు రెండేళ్లు..

కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల శివారులో జనశక్తి నక్సలైట్లు నారాయణ చెరువు తవ్వారు. వారి పిలుపుతో తరలివచ్చిన ప్రజలు శ్రమదానం చేశారు. మండల ఇంజినీర్ల నుంచి సాంకేతిక సహకారం తీసుకున్నారు. ట్రాక్టర్లు, పరికరాలను పార్టీ పరంగా సమకూర్చారు. ఈ చెరువు పనులు రెండేళ్లపాటు జరిగాయి. చెరువు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. నక్సలైట్లు నిర్మించిన ఈ మూడు చెరువులను అప్పట్లో మానవ హక్కుల సంఘం నేత బాలగోపాల్ బృందం సందర్శించింది. మావోయిస్టు దళనేత కొట్టాల మోహన్‌రెడ్డి, జనశక్తి నేత జంపన్న తమ సొంత గ్రామాల్లోనే చెరువులు తవ్వారని బాలగోపాల్ అప్పట్లో విమర్శనాత్మక వ్యాసాలు రాయడం చర్చనీయాంశమైంది.

నేనూ పనికి పోయిన



ఊరంతా చెరువు కోసం పని చేసిన్రు. నేనూ నెలరోజుల పాటు పోయిన. ఆ చెరువే ఇప్పుడు ఆధారమైంది. నాకు రెండెకరాల పొలం ఉంది. జంపన్న చొరవతోనే చెరువు తవ్వినం. అందుకే దానికి ఆయన పేరు పెట్టిన్రు.
– భూక్యా తేజనాయక్, రైతు, రంగంపేట

ఊర్లకు రోడ్డు వేశాం



రంగంపేటలో పార్టీ ప్రోద్బలంతో మార్గండి చెరువు తవ్వాం. అప్పటికే ఊరిలోకి రోడ్డు లేకుంటే వేశాం. ట్రాక్టర్లకు డీజిల్‌ను పార్టీ పరంగా సమకూర్చాం. జంపన్న నాయకత్వంలో కులాలవారీగా జనాన్ని కదిలించాం. – ఎడ్ల లక్ష్మీరాజం ఉరఫ్ సాగర్, జనశక్తి రాష్ట్ర మాజీ నాయకుడు


రంగంపేట మార్గండి చెరువు వద్ద జంపన్న స్మారక స్తూపం

గుణపాఠం నేర్చుకోని అధికారులు

- ఇంజినీర్ల తప్పిదంతోనే అర్పల్లిలోకి వరద
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజం

సారంగాపూర్(జగిత్యాల): అధికారులు గుణపాఠాలు నేర్చుకోలేదని, అందుకే అర్పపల్లి గ్రామంలోకి వరద వచ్చిచేరి ప్రజలు నానా తిప్పలు పడ్డారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. భారీవర్షాలతో గ్రామంలో చోటుచేసుకున్న నష్టాన్ని ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతేడాది జూలైలో కురిసిన భారీవర్షాలతో మునీశ్వరుల చెరువు తూములు మట్టిలో కూరుకుపోయి, వరద ఎగువ ఉన్న అర్పపల్లి గ్రామంలోకి చేరిందన్నారు. ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. అయితే, ఈ లోపాన్ని గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు.. చెరువు కట్టకు గండి పెట్టారని తెలిపారు. మరమ్మతులకు నిధులు విడుదల చేసి ఏడాది గడచినా పనులు పూర్తికాలేదని, దీంతో మరోసారి వరద గ్రామాన్ని ముంచెత్తిందని ఆరోపించారు. పంటలు నీట మునిగాయని అన్నారు. చాలా గ్రామాల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, నాటువేసిన పొలాలు నీట మునిగాయని చెప్పారు. మాజీ వైస్ ఎంపీపీ బేతి పూర్ణచందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోగ గంగారాం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అప్పం స్వామి, నాయకులు జకమకల పెద్ద మల్లారెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.


కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రైతులను ఆదుకోవాలి

జగిత్యాలరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంతర్గాంలోని పంట పొలాల్లో వేసి ఇసుక మేటలను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రకృతి వైపరీత్యాల కింద ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని ఆయన కోరారు.

జగిత్యాలటౌన్: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన పరీక్షలు రాసేందుకు అభ్యర్థుల ఆప్షన్ల మేరకు పరీక్ష కేంద్రాలు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థల నియామక మండలి చైర్మన్‌కు లేఖ రాశారు.

ఇసుకమేటలు.. మట్టిదిబ్బలు

సారంగాపూర్: ఈ ఫొటోలో కనిపిస్తున్న పొలం హైదర్‌పల్లికి చెందిన లైశెట్టి నర్సయ్యది. రెండెకరాల్లో నాటు వేయాల్సి ఉండగా భారీ వర్షాలతో వరద ప్రవాహానికి పొలంలో బండరాళ్లు ఇసుకమేటలు వేశాయి. గత సంవత్సరం జూలైలో ఇదే పరిస్థితి నెలకొనగా మే నెలలో రూ.3 లక్షలతో ట్రాక్టర్లతో ఇసుక, బండలను తరలించి మళ్లీ రాగడి మట్టి నింపి సేద్యానికి అనుకూలంగా మార్చాడు. మళ్లీ వరద ప్రవాహానికి బండరాళ్లు వేశాయి. ఇక తనకు చదును చేసే ఓపిక, ఖర్చు పెట్టే స్థోమత లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పలు గ్రామాల్లోని రైతుల పొలాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఇసుక మేటలు, మట్టి దిబ్బలతో పొలాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


హైదర్‌పల్లి వాగువద్ద ఆనవాళ్లు కోల్పోయిన పొలం



పెర్కపల్లి గ్రామ శివారులో..

జగిత్యాలరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాలన్నీ ఇసుక మేటలతో నిండిపోయాయి. జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామ శివారులోని బొల్లివాగు ఎప్పుడూ లేనంతగా ఉధృతంగా ప్రవహించడంతో సమీప ప్రాంతాల్లోని సుమారు 50 ఎకరాల మేర పొలాల్లో రాళ్లు, ఇసుక మేటలు వేశాయి. కొన్నిచోట్ల రైతుల పొలాల హద్దులు కూడా గుర్తించడం కష్టతరంగా మారింది.

పీరీలు చూసేందుకు వెళ్తూ..

- ఆటోను ఢీకొన్న లారీ
- అంబులెన్స్ డ్రైవర్ మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు
- అదే అంబులెన్స్‌లో మృతదేహం ఇంటికి..
- కోరుట్లలో విషాదం


నుజ్జునుజ్జయిన ఆటో

కోరుట్ల: ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన కోరుట్ల శివారులో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోరుట్లలోని హాజీపురాలో నివాసముండే అంబులెన్స్ డ్రైవర్ ఇమ్రాన్ (22), జమ్మూ (24), వాజిద్ (31), ఇమ్రాన్ (22), అబీద్ (23), మోసిన్ (23), ఫాజిల్ (22) మేడిపల్లి మండలం పోరుమల్లలో జరిగే పీరీలను చూసేందుకు జమ్మూలో ఆటోలో బయలుదేరారు. కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకోగానే జగిత్యాల నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న ఇమ్రాన్, వాజిద్, జమ్మూకు తీవ్రగాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇమ్రాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. జమ్మూ, వాజిద్ జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఆదిల్ ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసునమోదు చేశారు. లారీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.


ఇమ్రాన్ (ఫైల్)

అదే అంబులెన్స్‌లో ఇంటికి..

ఆపద సమయాల్లో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడటంలో ముందున్న ఇమ్రాన్‌ను చివరికి అదే అంబులెన్స్‌లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత అదే అంబులెన్స్‌లో ఇమ్రాన్ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడం కలచివేసింది. కోరుట్లలో అంబులెన్స్ నిర్వాహకులు ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు.

పోలీసుల అదుపులో దొంగలు !

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో ఈనెల 26న రాత్రి హోటల్‌లో దొంగతనానికి పాల్పడిన దొంగలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన సట్ట రాజశేఖర్ తన హోటల్‌కు తాళంవేసి పని నిమిత్తం జగిత్యాలకు వెళ్లాడు. అర్ధరాత్రి కావడంతో ఇద్దరు స్నేహితులతో కారులో వెళ్తుండగా హోటల్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. ఇక్కడ ఏం పని అడగటంతో రాజశేఖర్‌పై దురుసుగా ప్రవర్తించారు. తాళాలు పగులగొట్టి ఉండగా అక్కడున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. మరో ముగ్గురు దొంగలను సైతం పట్టుకునేందుకు యత్నించగా వారు పారిపోయారు. వారిద్దరి వద్ద రెండు ద్విచక్రవాహనాలను పోలీసులకు అప్పగించారు. శనివారం ఐదుగురు దొంగలను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రోడ్డుపై బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో గాయపడిన తునికి గంగాధర్ (55) చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ భార్య రమాదేవి ఈనెల 22న ద్విచక్రవాహనంపై పనినిమిత్తం జగిత్యాలకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా వీరి బైక్‌ను పొలాస వద్ద కారు ఢీకొంది. గాయపడిని భార్యభర్తలను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గంగాధర్ మృతిచెందాడు. మృతుడి కుమారుడు వేణు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.


గంగాధర్ (ఫైల్)